అక్రమ మట్టి తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి

విశాలాంధ్ర - పెదపూడి : గత వారం రోజులుగా మండలంలో యదేచ్చగా జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడడమే కాకుండా అక్రమ దందాకు వినియోగిస్తున్న భారీ వాహనాల వేగానికి ఇటీవల తాళ్ళరేవు వద్ద జరిగిన విషాద ఘటన పునరావృతం అవుతుందేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోనీ కుమారప్రియం, పుట్టకొండ, తదితర గ్రామాల్లో భారీగా లారీలు, జేసీబీ, ట్రాక్టర్లతో పొలాల్లో మట్టిని స్థానిక బట్టీల్తో పాటు ఇతర జిల్లాల్లోని రాయవరం, మండపేట మండలాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. రాత్రి, పగలు తేడాలేకుండా పెద్ద ఎత్తున భారీ టిప్పర్లతో పరిమితిని మించిన వేగంతో మట్టిని తరలిస్తున్నారు. దీంతో రోడ్ల పై వెళ్లే ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తాళ్లరేవులో జరిగిన ఆటో, బస్సు ప్రమాదంలో 8 మంది చనిపోయిన నేపథ్యంలో ఈ గ్రామాల్లో ప్రజలు భారీ లారీల వేగం చూసే సరికి భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా అక్రమార్కులు విచ్చలవిడి మట్టిని తరలిస్తున్నారు. గ్రామీణ రోడ్లు ఇరుకుగా ఉండటంతో ప్రజలు, విద్యార్థులు, మహిళల రాకపోకలకు అంతరాయం వ్యక్తమవుతుంది. అలాగే రోడ్లు నూతనంగా నిర్మించిన రోడ్లు ఛిద్రమవుతున్నాయి. రైతుల పొలాల నుంచి ఇటుక బట్టీలకు తరలించాలంటే మైనింగ్ ఇతర అధికారుల అనుమతులు అవసరం ఉండాలి. అయితే అలాంటి అనుమతులు లేకుండా అధికారులు పట్టిపట్టనట్లు వ్యవరిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. తాళ్లరేవులో జరిగిన ప్రమాదాలు లాంటివి జరిగిప్పుడు అధికారం యంత్రాంగం స్పందిస్తుందా అంటు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి అక్రమ దందాలకు కళ్లెం వేసి ప్రభుత్వ ఆదాయం కాపాడడం మరీ ముఖ్యంగా ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించవలసిన బాధ్యత ఎంతైనా ఉంది.

ఆర్టీసీ బస్ స్టేషన్‌లో షాపులకు సీల్డ్ టెండర్లు పిలుపు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : బస్ స్టేషన్‌లో ఖాళీగా ఉన్న షాపులకు, ఖాళీ స్థలాలకు వ్యాపార నిమిత్తం వ్యాపార సంస్థల నుండి వ్యాపారస్తుల నుండి సీల్డ్ టెండర్లు పిలుస్తున్నట్లు ఏలేశ్వరం డిపో మేనేజర్ జి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఏలేశ్వరం ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న ఏలేశ్వరం, జగ్గంపేట ప్రత్తిపాడు, బస్ స్టేషన్లకు సంబంధించిన షాపులకు, ఖాళీ స్థలాలకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. టెండర్ దరఖాస్తులు ఈనెల 22వ తేదీ నుండి 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఏలేశ్వరం డిపో మేనేజర్ కార్యాలయం నందు అందుబాటులో ఉంటాయన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు సీల్డ్ కవర్లు ఈనెల 29వ తేదీ ఉదయం 10:30 నుండి 2 గంటలలోపు కార్యాలయంలో అందజేయాలని ఉన్నారు. అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు సమక్షంలో టెండర్లు ఖరారు చేయడం జరుగుతుందన్నారు. దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ఆర్టీసి ఉందన్నారు.

గ్రామ వలంటీర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఉంగ్రాజవరం : మండలంలో ఖాళీ అయిన గ్రామ వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో ఏ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేకుండా మే నెల 1వ తేదీకి 18 నుండి35 సంవత్సరాల వయసు కలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 24 వ తేదీన ఇంటర్వ్యూలు, 25న ఎంపికైన వారికి నియామక పత్రాలు, 26 నుండి శిక్షణ తరగతులు ఉంటాయని, 27వ తేదీ నుండి అభ్యర్థులు విధులకు హాజరవుతారన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైనవారు ఆధార్ కార్డు, విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. దమ్మెన్ను ఎస్సి1, కే సావరం బిసి 2, కాల్దారి ఎస్సీ 2, వేలివెన్ను ఓసి 1 మండలంలో ఖాళీగా ఉన్న గ్రామాలు. అభ్యర్థులు ఆయా గ్రామాలకు చెందిన వారై మాత్రమే ఉండాలని, నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయని ఎంపిడిఓ తెలిపారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - ఉంగ్రాజవరం: శిథిలమైన పాత క్వార్టర్స్ ను తొలగించి, వాటి స్థానే స్టాఫ్‌కు నూతన కాటేజీలు నిర్మించేందుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి కె వెంకటేశ్వరరావు సూచించినట్లు ఉంగ్రాజవరం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ఆర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్యాధికారి మండల ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మిక తనిఖీ చేసి, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు డాక్టర్ ప్రసాద్ తెలిపారు. ప్రతీ జాతీయ కార్యక్రమములకు సంబందించి అన్ని రికార్డ్ లను, రూమ్ లను పరిశీలించి తగు సూచనలు చేసినట్లు ప్రసాద్ తెలిపారు, సిబ్బందినీ, రోగులకు అందించే సేవల గురించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

దోమల నివారణ సామాజిక బాధ్యత

విశాలాంధ్ర - ఉంగ్రాజవరం: దోమల నివారణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు తణుకు వెక్టార్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి వెంకటేశ్వరరావు. శుక్రవారం ఉంగ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వడ్లూరు లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం, మురుగు నీరు పారుదలకు ఆటంకం కలగకుండా డ్రైన్ లలో చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించడం ద్వారా మాత్రమే దోమల పుట్టుక నిలుపుదల సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జె.శ్రీనివాస్, హెల్త్ సెక్రెటరీ, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

వలంటరీ వ్యవస్థ ద్వారానే సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: వలంటరీ వ్యవస్థ ద్వారానే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దేవరపల్లి పంచాయితీ వద్ద వాలంటీర్లకు సన్మానం గోపాలపురం మే 19 వైభవ్ న్యూ గోదావరి న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి ఆంధ్రప్రదేశ్లో గల వాలంటరీ వ్యవస్థ భారతదేశంలోని ఆదర్శంగా నిలిచి అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్ర ప్రభుత్వానికి వాలంటీర్లు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు స్పష్టం చేశారు దేవరపల్లి గ్రామపంచాయతీ వద్ద వాలంటీర్ల వందనం కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ వాలంటరీ వేస్తావాలని ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి సంక్షేమ పథకాలు సక్రమ అమలు జరుగుతున్నాయి అన్నారు కష్ట కాలంలో వాలంటీర్లు చేసిన సేవలు మరువలేమని అన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలం మండపం ఊరచెరువు పని ప్రదేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ డి రాజగోపాల్ అవగాహన సమావేశం నిర్వహి ంచారు. ఉపాధి కూలీలు అంతా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటలకు పని ప్రదేశం వద్దకు చేరుకుని కొలతల ప్రకారం 11 గంటల వరకు పనులు చేస్తే 272, వేతనం పొందవచ్చని ఏపీవో తెలిపారు. ఉపాధి పథకంలో మామిడి, జీడి మామిడి, కొబ్బరి తదితర పంటలకు మూడు సంవత్సరాల కాలం పనులు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట టిఎ వెంకట్, ఫీల్డ్ అసిస్టెంట్ బాబి మేట్లు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు తీసుకోరా?

విశాలాంధ్ర - పెదపూడి : మండలంలోని పెద్దాడ గ్రామంలో అక్రమంగా చేపల చెరువు తవ్వి పర్యావరణానికి హాని కలిగిస్తున్నారంటు గ్రామస్తులు ఫిర్యాదు చేసిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని 351, 387, 388, 389, 390, 391 సర్వే నెంబర్‌లోని సుమారు 10 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వు తున్నారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఘటనాస్థలానికి సందర్శించిన రెవెన్యూ ఫిషరీస్ శాఖ అధికారులు చెరువుల తవ్వకాన్ని గుర్తించినప్పటికీ అక్కడ ఉన్న వారిని కనీసం విచారించకపోవడం, వాహనాలను స్వాధీనం చేసుకోకపోవడంతో వారి తీరుపై గ్రామస్తులు అసహనాన్ని, అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలోని చంద్రబాబుశాఖా గ్రంథాలయం నందు సమ్మర్ క్యాంపు నిర్వహించబడుచున్నది ఈ సమ్మర్ క్యాంపును గ్రామ సచివాలయం సెక్రటరీ వి.సుజాత శుక్రవారం సందర్శించినారు. పుస్తకా లపై ఆసక్తిని పెంచడం కోసం ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని, సెల్ ఫోన్‌లతో కాలక్షేపం చేయకుండా విద్యార్థులు గ్రంథాలయంలో లభించే పుస్తకాలతో గడపాలన్నారు విజ్ఞానంతో పాటు వినోదాన్ని కలిగించే క్రీడ సామాగ్రి కూడా విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు కె సుమన్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని 20 మందిపై కేసులు

విశాలాంధ్ర - చాగల్లు : మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చాగల్లు ఎస్సై సిహెచ్ వి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం నిబంధనలు పాటించని 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మైనర్లు వాహనాలు నడిపిన, సరైన ధ్రువపత్రాలు లేకున్నా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

వైసీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలి

విశాలాంధ్ర - అనపర్తి : పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అంతా కలసికట్టుగా పనిచేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసి వైయస్ జగన్మోహన్ రెడ్డి రెండవసారి సీఎం పదవి చేపట్టే విధంగా పాటు పడాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి సూచించారు. శుక్రవారం రాష్ట్ర నియోజక వర్గ స్థాయిలో వివిధ పదవుల్లో నియమితులైన పలువురు నేతలు స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే సత్తి ని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేని కలిసి రాష్ట్ర ప్రచార విభాగ సెక్రటరీ మండ రాజారెడ్డి, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షులు మల్లిడి నితిన్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సబ్బెళ్ళ మోహన్ రెడ్డి, వాణిజ్య విభాగ కార్యదర్శి కడిమి శ్రీను ధన్యవాదాలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ బీసీ సెల్ నాయకులు కేతా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మా వెంకటరెడ్డి (పెదపూడి), వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనుసూరి సుబ్రహ్మణ్యం, పార్టీ రాష్ట్ర సేవాదళ్ సెక్రటరీ చిర్ల వీర్రాఘవరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్ రెడ్డి (హంస), ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి, ఛాంబర్ అధ్యక్షులు వెంకన్న బాబు, మాజీ జెడ్పిటిసి సత్తి భగవాన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచిత పీయూసీ క్యాంపులు గర్వనీయం

విశాలాంధ్ర - అమలాపురం : గేయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రజా శ్రేయస్సు కోరి ఉచిత పియూసీ క్యాంపులు నిర్వహించటం గర్వకారణమని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రవాణా శాఖా అధికారి అశోక్ ప్రతాప్ అన్నారు. శుక్రవారం స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో తాటిపాక గేయిల్ ఇండియా లిమిటెడ్ చీఫ్ మేనేజర్ కూరగంటి రాంబాబు ఆధ్వర్యంలో ఆయిల్ అండ్ గ్యాస్ సంరక్షణ ఉత్సవాలు 2023లో భాగంగా నిర్వహించిన ఉచిత పియూసీ క్యాంపునకు డిటిసి అశోక్ ప్రతాప్ ముఖ్య అతిధిగా హాజరై క్యాంపును ప్రారంభించారు. అమలాపురం రూరల్ సిఐ వీరబాబు, తహసీల్దార్ పల్లవి, డిపిఎస్ డైరెక్టర్ మను విహార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇటువంటి క్యాంపులు నిర్వ హించటం ప్రజల్లో అవేర్ నెస్ తీసుకురావటం అభినందనీయమని డిటిసి అశోక్ ప్రతాప్ అభినందించారు. భవిసత్తులో ఇటువంటి కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తే తాము ప్రోత్సహిస్తామని అన్నారు. క్యాంపును నిర్వహించిన చీఫ్ మేనేజర్ కూరగంటి రాంబాబును అశోక్ ప్రతాప్ అభినందించారు. ఇంధన పరిరక్షణ మరియు నెట్ జీరో ప్రాముఖ్యత గురించి వివరించారు. గేయిల్ అధికారులు సుధీర్, రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్‌ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర - ముమ్మిడివరం : కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అర్బన్ అఫైర్స్ కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశాల మేరకు ముమ్మిడివరం నగర పంచాయతీ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం వద్ద పాత పుస్తకాలు, ప్లాస్టిక్, ఫర్నిచర్, పాత చెప్పులు, ఎలక్ట్రికల్ సామాన్లు అన్ని పునర్వినియోగించేలా చేసి పేదలకు అందజేస్తామన్నారు. కమిషనర్ జి లోవ రాజ, మేనేజర్ పి నూకరాజు, ఏఈ కె సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ జెఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలో వెలిసిన అతి పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం ఈ ఆలయమునకు ఒక విశిష్ట కలిగి ఉంది ముందు పురుషుని రూపం వెనక స్త్రీ రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. హైదరాబాద్ వాస్తవ్యులు ఆనంద్ గోపాల్ వెంకట స్వర్ణ లక్ష్మి దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామిదర్శించుకొని దేవాలయ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1,00,116/-లు విరాళము సమర్పించారు.

వలంటీర్లకు సన్మానాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక విధాలుగా సహాయపడుతున్న వాలంటీర్లకు శుక్రవారం నుంచి అవార్డులను ప్రభుత్వం అందజేస్తా ఉందని, వాలంటరీలు పడుతున్న ఇబ్బందులపై ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ శుక్రవారం పత్రిక ప్రకటన చేశారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల కొరకు, రాష్ట్ర ప్రజల కొరకు, సంక్షేమ పథకాలు ప్రజల చేరువ కొరకు వాలంటరీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈ వాలంటీర్లకు జీతాలు కాకుండా గౌరవ వేతనంతో పేరుతో 5000 రూపాయలు మంజూరు చేస్తూ సంవత్సరాలు గడుపుతుంది, కానీ వారికి ఉద్యోగ భద్రత కరువైందని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, వారిపై నిజమైన అభిమానం కలిగి ఉంటే, వారికి నిజమైన సన్మానం చేయాలంటే వాలంటరీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గౌరవ వేతనం కాకుండా కనీస వేతనాలు అమలు చేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ మంజూరు చేస్తున్న ఐదువేల రూపాయలు ఏ మాత్రం సరిపోవడం లేదని, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, వాలంటరీలు జీతాలు పెంచితే ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వాలంటరీలే సన్మానాలు చేస్తారని, పాలాభిషేకాలు చేస్తారని, లేకుంటే 2024 ఎన్నికల్లో లోపు వాలంటీర్లకు జీతాలు పెంచకపోతే వాలంటరీలంతా ఏకమై భవిష్యత్తు ఉద్యమానికి సిద్ధం కావాలని, వాలంటరీ అందరికీ ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రసాద్ అన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - రావులపాలెం : గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేకపోయిన సంక్షేమాభివృద్ధిని రాష్ట్రంలో ఈ నాలుగేళ్ల లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసి చూపించారని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వివిధ సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని కుటుంబ సభ్యులకు వివరించారు. ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని ఇచ్చిన హామీలలో 98 శాతం అమలుచేసి చూపించామని అన్నారు. ప్రతి కుటుంబానికి కనీసం రూ.లక్ష నుంచి 10 లక్షల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో తెలుగుదేశం నాయకులు, జన్మభూమి కమిటీ మెంబర్లు లబ్ధిపొందితే, వైసీపీ ప్రభుత్వంలో పేద ప్రజలందరికీ లబ్ధిచేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వాకపల్లిలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవంలో విషాద ఘటన చోటు చేసుకుంది. రౌతులపూడి మండలం ఎస్ పైడిపాలకు చెందిన ఈగల ప్రవీణ్(11)అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా అమ్మమ్మ ఇంటికి జాతర చూడడానికే వచ్చాడు. జాతరలో 11 కేవీ విద్యుత్ వైర్లు ప్రవీణ్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్‌బి పట్నం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెండ్

విశాలాంధ్ర - పెద్దాపురం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పెద్దాపురం మండలం ఆర్‌బి పట్నం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ద్వామా పిడి అడపా వెంకటలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. రామకృష్ణపై వచ్చిన ఫిర్యాదులు. అవినీతి నేరం రుజువు కావడంతో ఆ శాఖాధికారులు రామకృష్ణను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యినట్లు ఎంపీడీఓ హిమమహేశ్వరి తెలిపారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

కపిలేశ్వరంలో ఫ్యామిలీ డాక్టర్

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం-2 సచివాలయం పరిధిలోని బిసి ఏరియా, రామాలయం వద్ద అంగర పిహెచ్‌సి వైద్యాధికారులు డా పిఎస్ఎస్ డి రత్న కుమారి మరియు డా జె అనూజ ప్రియాంక అధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డా పిఎస్ఎస్ డి రత్న కుమారి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ నెలా 3వ శుక్రవారం బిసి ఏరియా రామాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరం నందు గర్భిణీలను, బాలింతలను మరియు శస్త్రచికిత్సలు జరిగి లేవలేని స్థితిలో ఉన్న వారిని వారి ఇంటి వద్దనే పరీక్షించి మందులు అందజేయడం మరియు అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ వైద్య శిబిరములో 106 మందికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొని, తమ సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, 104 సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

31న అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర - మామిడికుదురు : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారి దివ్య తిరు కళ్యాణోత్సవాలు ఈనెల 30 నుండి జూన్ 3వ తేది వరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పి.గన్నవరం ఎంఎల్ఏ కొండేటి చిట్టిబాబు నివాసం వద్ద కల్యాణోత్సవం గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 31వ తేదీ రాత్రి 9:15 ని.లకు శ్రీ బాల బాలాజీ స్వామి వారి దివ్య తిరు కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహిస్తామని ఎంఎల్ఏ కొండేటి చిట్టిబాబు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కళ్యాణోత్సవాలు తిలకించాలని కోరారు. ధర్మ కర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మ కర్తల మండలి సభ్యులు పెదమల్లు ఉషారాణి, చిట్టాల సత్తిబాబు, బత్తుల విజయ గంగా రత్నం, గూటం శ్రీనివాస్, కొమ్ముల సూరిబాబు, బొరుసు పార్వతి దుర్గా భవానీ, ఉప ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచర్యులు, ముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాస్, వేదపండితులు జోష్యుల సోమయాజులు, ఎంపీటీసీ బొంతు నీలిమ, మాజీ చైర్మన్ పిచ్చిక శివ నాగ సత్యనారాయణ (చిన్న), ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి డి శ్రీరామ వర ప్రసాదరావు తెలిపారు.

రావి రామ గోపాల నాగ ఆదిత్య తేజకు నియోజకవర్గ స్థాయి అవార్డు

విశాలాంధ్ర - అంబాజీపేట : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో సన్మానించ నున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి పరీక్షల్లో అంబాజీపేట మండలం అంబాజీపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివి 572 మార్కులు సాధించిన రావి రామ గోపాల నాగ ఆదిత్య తేజకు నియోజకవర్గ స్థాయిలో అవార్డ్ లభించింది. ఈ సందర్భంగా అవార్డు పొందిన రావి రామ గోపాల నాగ ఆదిత్య తేజను ప్రధానోపాధ్యాయులు బీర హనుమంతరావు, యంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పిటిసి బూడిద వరలక్ష్మి లక్ష్మీపతి, సర్పంచ్ నాగబత్తుల శాంతకుమారి సుబ్బారావు, ఎయంసి వైస్ చైర్మన్ నాగావరపు నాగరాజు, సొసైటీ చైర్మన్ దొమ్మేటి సత్యమోహన్, ఆశ్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబు తదితరులు అభినందించారు.

శివాలయం ఆవరణలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక ధరణి కోటలో గల శివాలయం ఆవరణలో లక్షలాది రూపాయల వ్యయంతో ప్రత్యేక పూజా మండపం, కాళ భైరవ స్వామి, నవగ్రహ విగ్రహాలు ఏర్పాటుతో పాటు ఆలయ ప్రాంత మంతా అత్యంత సుంద రంగా తీర్చిదిద్దుతున్నట్లు వైసిపి జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు, ఆలయ కమిటీ సభ్యులు సత్తి శ్రీనివాసరెడ్డి(ఎస్ ఎస్), ప్రముఖ వ్యాపారవేత్త తమలంపూడి వెంకటరెడ్డి(వాసు) తెలిపారు. శుక్రవారం విశాలాంధ్రతో మాట్లాడుతూ పలువురు ప్రముఖులు విరాళ సహాయంతో ఆలయ ప్రాంగణంలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో ఆలయం, పరిసర ప్రాంతంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా తీర్చి దిద్దడం జరుగుతుందని శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి చెప్పారు. దసరాలు, కార్తీక మాసం వంటి సందర్భంలో ఒకేసారి పలు జంటలు అభిషేకాలు నిర్వహించుకునే విధంగా మండపం నిర్మించడం జరుగుతుందని ఎస్ ఎస్, వాసు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

విశాలాంధ్ర - మండపేట : వైఎస్సార్ ప్రభుత్వం పనిచేసే ప్రభుత్వమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం 13 వ వార్డులో నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట ముఖ్య అతిథిగా పాల్గొని వార్డు పరిధిలో ఉన్న పాటిమీద, శెట్టిబలిజ వీధుల్లో పర్యటించారు. తొలుత వైస్ చైర్మన్ గనేశ్వరరావు నేతృత్వంలో స్థానిక నాయకులు, వార్డు ప్రజలు ఆయనకు పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. పాటిమీద, శెట్టిబలిజ పేటలో ఉన్న రామాలయాలలో సీతా రాములను దర్శించుకుని పర్యటన కొనసాగించారు. వార్డులోని మహిళలు, వృద్ధులను ఆయన ఆత్మీయంగా పలకరిస్తూ ప్రభుత్వం పథకాల లబ్దిని వివరించారు. అనంతరం వార్డు సమస్యలను కమిషనర్ టి రామ్ కుమార్ మున్సిపల్ సిబ్బందిని వెంట బెట్టుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేగుళ్ల నారాయణరావు (నారయ్య బాబు), వైఎస్సార్సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, మహిళా నాయకురాలు ఓగిరాల దేవి, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవింద రాజు, కౌన్సిలర్లు పోతంశెట్టి వర ప్రసాద్, చిట్టూరి సతీష్, పిల్లి శ్రీనివాస్, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గమ్మ, శెట్టి కల్యాణి, కొవ్వాడ బేబి, షేక్ అండ్ షేక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా, ఐమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.

మచ్చలేని మహామనిషి పుచ్చలపల్లి సుందరయ్య

విశాలాంధ్ర - తాళ్లపూడి:

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తాళ్లపూడి మండల శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు శుంకర వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు . ఈ కార్యక్రమం లో వల్లేపల్లి నరసింహమూర్తి ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు తూర్పుగోదావరి జిల్లా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు మాట్లాడుతూ మార్క్సిజం అన్న మహత్తర పీడిత ప్రజావిముక్తి సిద్ధాంతానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేసి, అహర్నిశలూ దాని కొరకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అన్నారు. భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన మహనీయుల్లో కామ్రేడ్ సుందరయ్య ఒకరని, దక్షిణ భారత దేశంలో ఉద్యమ ప్రారంభ కులుగా తెలుగునాట ఆఉద్యమ నిర్మాత, వీరోచిత తెలంగాణా రైతాంగ విప్లవ పోరాట నిర్వాహకుల్లో ఆయన ముఖ్యులని భారతదేశం అంతటా ఉద్యమ నిర్మాణానికి ఆయన కృషి చేశారన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగపురి పోసి బాబు, సరిగల గంగరాజు, మైరెడ్డి శేషగిరిరావు, గుండె పల్లి సత్య నారాయణ, ఎండపల్లి నాగేంద్రరావు , చిక్కాల పిచ్చి బాబు, ముళ్ళ వీర వెంకట సత్య నారా యణ, జొన్నకూటి గంగరాజు పాల్గొన్నారు.

ఆన్ లైన్ సేవలైనా చేతులు తడపాల్సిందే..!

విశాలాంధ్ర - జగ్గంపేట : గ్రామీణ ప్రాంతాల్లో అవినీతి జరగకూడదని ముఖ్య ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయాలు వ్యవస్థను తీసుకు వచ్చారు. అయితే అక్కడ నియమించిన సిబ్బంది మాత్రం అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ వ్యవహారం అంతా రెవెన్యూ శాఖలోని క్రింది స్థాయి అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. కుల ధ్రువీకరణ పత్రం కావాలన్నా, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ కావాలన్నా ఇలా ఏ సర్టిఫికెట్ కావాలన్న ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందే. అలా చేసుకునే క్రమంలో క్రింద స్థాయి అధికారులకు చేయి తడపాల్సిందే. ఇటీవల కాలంలో జగ్గంపేట సచివాలయం నాలుగులో గ్రామానికి చెందిన వ్యక్తి ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే రూ.5 వేలు చెల్లించాలని ఈ సొమ్ములు కింద నుంచి పై స్థాయి వరకు సరిపెట్టుకురావాలని సమాధానం ఇచ్చారని వాపోయాడు. దీంతో లబ్ధిదారులు లబో దిబో మంటున్నారు. అలాగే జగ్గంపేట మండలం రామవరం గ్రామ పరిధిలో ఉన్న సచివాలయం 1 లో అదే గ్రామానికి చెందిన మండపాక బ్రహ్మాజీ పాస్ పుస్తకం నిమిత్తం దరఖాస్తు చేసుకునేందుకు వస్తే అక్కడ ఉన్న సిబ్బంది రూ.10 వేలు ఇస్తే పనైపోతుంది అని సమాధానం ఇవ్వడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది . దీంతో పాస్ బుక్ దరఖాస్తు చేసుకున్న బ్రహ్మాజీ మాట్లాడుతూ నా భూమి నిమిత్తం పత్రాలు అన్ని సరిగ్గా ఉన్నాయని అయినప్పటికీ 10000 లంచం అడిగారని దీని వ్యతిరేకించడంతో బయటికి నెట్టేసి తలుపులు వేసేసారని వాపోయాడు. అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొవడంతో ఈ వ్యవహారం తహశీల్దారు వద్దకు చేరింది. దీంతో మండపాక బ్రహ్మాజీని దరఖాస్తు చేసుకోమని పాస్ బుక్ ఇప్పిస్తానని తహశీల్దారు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాజశ్రీ విజయనగరం 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి మరియు జడ్జి ఫ్యామిలి కోర్టు విజయనగరం

OS 28/2021

శ్రీనారు అప్పలరాజు... వాది
శ్రీమతి గార్లంక సుజాత వగైరాలు..
ప్రతివాదులు

To
బండి ప్రియాంక, W/o శ్రీనివాస్,
డోర్ నెం.7-46, ఇందుకూరుపేట, దేవిపట్నం
తూర్పుగోదావరి జిల్లా

పై నెంబరులో గల క్లయింటులో వివరించిన షెడ్యూలు దాఖలా ఆస్తులకు ఇందలి వాది గార్కి రిజిష్టరు క్రయ దస్తావేజు చేయవలసిందిగా మీపైన మరియు మిగతా ప్రతివాదులపైన దావా దాఖలు చేసియున్నారు. కావున సదరు దావాలో మీకు అక్షేపణలు, వాదనలు యున్న యెడల స్వయముగా గాని, వకీలు ద్వారా గాని, మీకు సంబంధించిన దస్తావేజులలో మీరు తేది 16-06-2023 దిన ఉ.10:30ని.లకు పైకోర్టు ఎదుట హాజరయ్యి దాఖలు చేసుకోవలెను. లేనియెడల సదరు దావా మీ పరోక్ష విచారించి తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది. పై కోర్టు వారి ఉత్తర్వులు పైన యిందు మూలముగా ప్రకటించడమైనది.

శ్రీ పోతుల రాంబాబు
వాది తరుపున న్యాయవాది, విజయనగరం
9996458999, 8977966789